www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 జూన్ 2023
5
తూర్పుగోదావరి



గ్రీన్ కోర్ సిఇఒ అనిల్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కడియం

గ్రీన్ కోర్ సిఇఒ చెలమశెట్టి అనిల్ సేవలు అభినందనీయమని మాధవరాయుడు పాలెం సర్పంచ్ అన్నదేవుల చంటి అన్నారు. అనిల్ బుధవారం కాకినాడ జెఎన్‌టియులో గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా అనిల్, స్వాతి దంపతులకు గజమాల వేసి చంటి ఘనంగా సత్కరించారు. ఆపన్నులను ఆదుకోవడంలో అనిల్ ముందు ఉంటారని తెలిపారు. మాధవరాయుడుపాలెం గ్రామ అభివృద్ధికి కూడా ఆయన ఎంతో సహకారం అందించారని చంటి పేర్కొన్నారు.



అనిల్ దంపతులను సత్కరిస్తున్న చంటి

కౌలు రైతులకు సాయమందేనా..?

- ఆదుకోని సిసిఆర్ కార్డులు
- బీమా, మద్దతుధర ఎండమావే



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో కౌలు రైతులకు సాయం అందేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. జిల్లా రైతాంగం ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సాయం లభించని రైతులు ప్రైవేట్ అప్పుల కోసం పరుగులు తీస్తున్నారు. ప్రతి ఏటా జిల్లాలో సుమారు 2 లక్షలకు పైగా ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగా ప్రతి ఏటా సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. సాధారణ రైతులతో పోల్చితే కౌలు రైతులకు ప్రత్యక్షంగా కౌలు భారంతో పాటు పరోక్షంగా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. బ్యాంకు రుణాలు మొదలు, పంటలకు బీమా, దిగుబడులకు మద్దతు ధర పూర్తిగా ఎండమావిలా మారుతున్నాయి. రైతులు, రైతు సంఘాల పోరాటాల ఫలితంగా పాలక ప్రభుత్వాలు ఎట్టకేలకు కౌలు రైతులకోసం సిసిఆర్ (క్రాప్ కల్టివేటర్ రైట్) కార్డులను అందజేశాయి. కానీ రైతుల సంక్షేమాన్ని ఈ కార్డులు ఏమాత్రం పరిష్కరించడం లేదు. ఈ కార్డులు అందించేందుకు భూయజమాని అనుమతి తప్పనిసరి చేయడమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది.

అత్యధిక మంది సాగుదారులు కౌలు రైతులే...

తూర్పు గోదావరి జిల్లాలో లక్ష మందికిపైగా కౌలు రైతులు ఉండవచ్చని అంచనాగా తెలుస్తోంది. సాగు వ్యయంలో కౌలుతో సహా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంత వెచ్చించినా ప్రకృతి విపత్తులతో పంట చేతికి రాని సందర్భాలు అధికంగా ఉంటున్నాయి. దీంతో భారీగా కౌలు రైతులు నష్టపోతున్నారు. సిసిఆర్ (క్రాప్ కల్టివేటర్ రైట్) కార్డులు అందజేయడం ద్వారా కొంత ఊరట లభించే అవకాశాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 50 శాతం మంది కౌలు రైతులను గుర్తించడం సాధ్యపడటం లేదు. ఫలితంగా పెట్టుబడి సాయం, పంట ఉత్పత్తులను అమ్ముకోవడం, నష్ట పరిహారం లేదా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంటల రుణం ఇలా ఏది వర్తించాలన్నా సిసిఆర్ కార్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అధికారులు సకాలంలో స్పందించి కౌలు రైతులందరికీ సిసిఆర్ కార్డులు అందజేయాలని కౌలు రైతు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కౌలు రైతులకు సాయం కరువు

సొంత భూమి ఉన్న రైతులు ప్రభుత్వం అందించే అరకొర రాయితీ విత్తనాలతో పాటు ఇప్పటికే వారి ఖాతాలో జమ అయిన రైతు భరోసా కొంత ఊరటనిస్తోంది. దీంతో సాగుకు సిద్ధమవుతున్నారు. కానీ కౌలు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. సిసిఆర్ కార్డుల ప్రక్రియ తాజాగా ప్రారంభమైంది. గతంలో కార్డులు ఉన్న రైతులు కూడా మళ్లీ రెన్యువల్ చేయించుకుంటేనే మనుగడలోకి వస్తుంది. భూ యజమాని అనుమతితో కార్డును రెన్యువల్ చేయించుకోవాలి. ఈ ప్రక్రియ మొత్తం మేలో ముగించి ఖరీఫ్ ప్రారంభమయ్యే జూన్ నెల మొదటి రెండు వారాల్లో రైతులకు కార్డులు ఇవ్వాలి. ఈ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నారు మడులు వేసుకునేందుకు రైతులు ప్రైవేట్ అప్పులను ఆశ్రయిస్తున్నారు. మరో వైపు కౌలు ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క విధంగా వసూలు జరుగుతోంది. నీటి సౌకర్యం బాగా ఉండి ఎకరాకు వేలకు వేలు కౌలు కట్టాలి. లేదా పంటలో మూడో వంతు చెల్లించాల్సి వస్తుంది. ప్రకృతి విపత్తులతో నష్టం వచ్చినా కౌలు చెల్లించక తప్పడంలేదు. మార్కెట్‌లో ధర లేకపోయినా నష్టపోవాల్సిందే. ఈ బాధలు పడలేక చాలామంది వ్యవసాయానికి దూరమవుతున్నారు.

భూ యజమానులు వెనకడుగు

భూ యజమానులు అనుమతి పత్రాలు అందించేందుకు వెనకడుగు వేయడంతో కౌలు రైతులు ప్రభుత్వ ఫలాలకు దూరమవుతున్నారు. కౌలుదారులకు న్యాయం చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ముందు భూ యజమానులకు సిసిఆర్ కార్డులపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలి. కౌలు రైతులకు ఈ కార్డు ఇవ్వడానికి అంగీకరిస్తే తమ భూహక్కుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలియజెప్పాలి. ఈ కార్డు మనుగడలో ఉండేది కేవలం 11 నెలలే కాబట్టి తరువాత యజమాని కౌలుదారును మార్చుకున్నా లేక కౌలును రద్దు చేసుకున్నా ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించాలి. కానీ క్షేత్ర స్థాయిలో వీటి మీద అవగాహన కల్పించాల్సిన యంత్రాంగం అంతగా శ్రద్ధ చూపడం లేదు. దీనివల్ల జిల్లావ్యాప్తంగా 50 శాతం మంది మాత్రమే కౌలు రైతులుగా గుర్తింపు పొందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా జిల్లా రైతాంగానికి ఇచ్చే వేల కోట్ల రుణ పద్దులో కౌలు రైతుల వాటా 10 శాతం ఉండాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ వాస్తవానికి ఈ వాటా చాలా తక్కువగా ఉంటోంది. వీరికి అందించే రుణం 2 శాతం కూడా దాటడం లేదు.

రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైంది

జిల్లాలో 67 వేల మందికి సిసిఆర్‌సి కార్డులు గతంలో అందజేశాము. రూ.సుమారు 21 కోట్లు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేశాము. తాజాగా రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైంది. జూన్1వ తేదీ నుంచి సాగునీరు విడుదలవుతోంది. రైతులకు పెట్టుబడి సాయంకోసం ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా నిధులు విడుదల చేస్తోంది. అదే విధంగా కౌలు రైతులకు సిసికార్డుల మంజూరులో భూ యజమానులకు దశల వారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. వాలంటీర్లు వ్యక్తిగతంగా కలిసి వివరిస్తున్నారు. కౌలు రైతులకు సహకరించాలని భూయజమానులను కోరుతున్నాము.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి.

పొగాకు వాడకానికి దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

పొగాకు వాడకానికి అందరూ దూరంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపు నిచ్చారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సిగరెట్, ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తులు వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ధూమపానం వల్ల ఏటా 80 లక్షల మంది చనిపోతున్నారన్నారు. సిగరెట్ వల్ల గొంతు క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ పొగాకు ఏ రూపంలో వాడినా అందులో ఉన్న నాలుగు వేల రకాల రసాయనాలు మనిషి ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతాయన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.దినేశ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల పరిధిలో ఉన్న దుకాణాలలో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను అమ్మకూడ దన్నారు. నిబంధనలను ఎవరైనా అతిక్రమించినట్లు గుర్తిస్తే వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలుత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రమేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డాక్టర్ కె.వెంకటేశ్వర రావు, డాక్టర్ రాజీవ్, డాక్టర్ ఎం.రాజకుమారి, డాక్టర్ లక్ష్మీ దేవి పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, అధికారులు

గోకవరం మండలంలోని జబిశాయపల్లిలో కొత్తపల్లి పిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ వైఎస్.రాయుడు ఆధ్వర్యాన పొగాకు దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఆశా వర్కర్లు గ్రామప్రజలు పాల్గొన్నారు

10 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

2వ తేదీ నుంచి నిర్వహించనున్న 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 6667 మంది, ప్రవేటు విద్యార్థులు 2806 మంది హాజరు కానున్నట్టు డిఆర్ఒ జి.నరసింహులు తెలిపారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో డిఇఒ ఎస్.అబ్రహాంతో కలిసి సమన్వయ శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఒ నర్సింహులు మాట్లాడుతూ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందు తప్పనిసరిగా విద్యార్థులు హాజరు కావలసి ఉంటుంది అన్నారు. వేసవి దష్ట్యా తాగునీటి వ్యవస్థ, మెడికల్ క్యాంపులను ఏర్పాట్లను చేయడంతో పాటు, పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్యాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ కోసం నాలుగు రెవిన్యూ ఆఫీసర్స్, నలుగురు ఎస్ఐలు, కానిస్టేబుల్స్‌తో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజమండ్రి డివిజన్‌లో 25 కేంద్రాలు, కొవ్వూరు డివిజన్‌లో 19 కేంద్రాల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. మున్సిపల్, మండల పరిధిలోని ప్రధాన కేంద్రాల్లో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని డిఇఒ ఎస్.అబ్రహాం తెలిపారు. జూన్ 2న ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు కంపోసిట్ కోర్స్, జూన్ 3న రెండవ లాంగ్వేజ్ హిందీ సంస్కతం, జూన్ 5న ఇంగ్లీష్, జూన్ 6న లెక్కలు, జూన్ 7న సైన్స్, జూన్ 8న సామాజిక శాస్త్రం, జూన్ 9న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ -2, ఒఎస్‌ఎస్‌సి ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్1, జూన్ 10న ఒఎస్‌ఎస్‌సి ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ -2 పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి స్పెషల్ బ్రాంచ్ డి.రామవర్మ, ఆర్ఎంపి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, డిటిఒ ఎన్.సత్యనారాయణ, ఆర్‌టిసి లైజన్ అధికారి బివిఎస్ఎన్.కుమార్, వైద్య శాఖ అధికారి పి.జాన్సన్, పోస్టల్ అధికారి ఎల్.శ్రీనివాస్, పంచాయతీ రాజ్, ఎలక్ట్రికల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి మాట్లాడుతున్న డిఆర్ఒ

పంచాయతీ కార్యదర్శి సరోజారాణికి డాక్టరేట్

ప్రజాశక్తి -కడియం

కామర్స్‌లో పిహెచ్‌డి చేసిన మురమండ పంచాయతీ కార్యదర్శి భీమాల సరోజారాణి ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఎ స్టడీ ఆన్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ ఇంప్లిమెంటెడ్ బై ఇండియన్ సీపోర్ట్స్ విత్ రిఫరెన్స్ టు కోస్టల్ ఆంధ్ర పోర్ట్స్ విభాగంలో సరోజారాణి డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. బుధవారం కాకినాడ జెఎన్‌టియులో జరిగిన స్నాతకోత్సవంలో విసి ప్రసాదరావు ద్వారా ఆమె డాక్టరేట్ అందుకున్నారు. వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీలో ఎంకామ్ చదివిన ఆమె గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఎంబిఎ చేశారు. తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేశారు. కైట్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా 2014లో పంచాయతీరాజ్ కార్యదర్శి పోస్ట్‌కు ఎంపికయ్యారు. డాక్టరేట్ అందుకున్న సరోజారాణిని డిపిఒ పి.జగదాంబ, డిఎల్‌పిఒ జె.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.రత్నకుమారి, మండల పరిషత్ ఎఒ కె.చంద్రరావు, ఇఒపిఆర్‌డి వైవివిఎస్ఎస్.లక్ష్మి, మురమండ సర్పంచ్ అయినవిల్లి రుక్మిణి వెంకటేశ్వరరావు అభినందించారు.



డాక్టరేట్ అందుకున్న సరోజారాణి



నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెసి

బల్క్ డ్రగ్స్ ల్యాబ్ నిర్మాణ ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని గంగోలులో సిఎస్‌డి లాబ్స్ ప్రయివేట్ లిమిటెడ్ నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ నంబూరి తేజ్ భరత్ పరిశీలించారు. సర్పంచ్ యండపల్లి శేఖర్ బాబు, తహశీల్దారు బి.రవీంద్రనాథ్, కార్యదర్శి అనురాధతో పాటు గ్రామస్తుల అభిప్రాయాలు, సమస్యలను జెసి తెలుసుకున్నారు. గ్రామంలోని కొంతమంది ఈ పరిశ్రమ కావాలని, మరికొందరు ఈ పరిశ్రమ గ్రామానికి దగ్గరలో ఉంటే కాలుష్యం వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పూర్తిస్థాయి పరిశీలన చేపడతామని జెసి తెలిపారు.

రైటర్: పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని చెరుకుమిల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు బుధవారం పలు అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.ఝాన్సీ రాణి మాట్లాడుతూ విద్యార్థులకు 7 ఈవెంట్స్ నిర్వహించామని తెలిపారు. సమ్మర్ క్యాంప్, ఎస్‌ఎంసి మీటింగ్, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ, కథలు చెప్పడం, రంగోలి, ర్యాలీ, క్విజ్, పద్య పఠనం, డిబేట్, పెయింటింగ్, ఎఫ్ఎల్ఎన్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అనంతలక్ష్మి, సిఆర్‌పి కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రు, వేలివెన్నులో బుధవారం నిడదవోలు ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస్ నాయుడు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనిలో భాగంగా తాడిపర్రులో శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామస్తులకిచ్చిన మాట ప్రకారం, ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రూ.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుండి 53.60 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తున్న గ్రామస్తులు మట్టా సత్య నారాయణను అభినందించారు. అనంతరం వేలివెన్ను శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, పాల్గొన్నారు.

సిఎస్‌డి ల్యాబ్ పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటాం

ప్రజాశక్తి-గోపాలపురం

గంగోలులో నిర్మిస్తున్న కెమికల్, బల్క్ పరిశ్రమల వల్ల గాలిలో నీటిలో వ్యర్థాలు ప్రవేశించి అనారోగ్య సమస్యలతో వ్యాధుల బారిన పడతారని ఎట్టి పరిస్థితుల్లో సిఎస్‌డి పరిశ్రమను అడ్డుకుంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. బుధవారం సిపిఐ నాయకత్వంలో సగ్గొండ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గోపవరం దళిత ఓడలోని కమ్యూనిటీ హాల్ గ్రౌండ్‌లో జరిగిన పోరాట సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఊరికి పరిశ్రమకు సుమారు 700 మీటర్ల పరిధిలో ఉందని దీనిని బట్టి పరిశ్రమ వల్ల ప్రజలకు వచ్చే అంటువ్యాధులు చర్మవ్యాధులు క్యాన్సర్ సైతం వచ్చే ముప్పు ఉందన్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో బల్క పరిశ్రమలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అలాంటిది ఊరు మధ్యలో బల్క పరిశ్రమ నిర్మించడం దారుణం అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదన్నారు. పరిశ్రమలు స్థాపనకు సిపిఐ పార్టీ వ్యతిరేకం కాదని, పరిశ్రమల ద్వారానే ఉద్యోగుల కల్పన జరుగుతుందని ఈ విషయం యాజమాన్యం గుర్తించి జనావాసాలకు సుదూర ప్రాంతంలో నెలకొల్పడం సమంజసమన్నారు. గ్రామానికి అత్యంత సమీపంలో ఫ్యాక్టరీ నిర్మిస్తున్న కారణంగా ఈ నెల 5న జరిగే గ్రామసభలో ప్రజలందరూ పాల్గొని ఈ పరిశ్రమ వద్దంటూతీర్మానం చేస్తామన్నారు. ఇక్కడ నిర్మించే పరిశ్రమల గూర్చి ఆలోచన వెనక్కు తీసుకునే వరకు సిపిఐ దశలవారీ పోరాటం చేస్తుందని ఇందులో భాగంగా నిరాహార దీక్ష మానవహారం హైవే నిర్బంధం వంటి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు వి.కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలపూడి సునీల్, రవీంద్ర, పోలపల్లి ఏసు, ముప్పిడి రాజేష్, చాపల యేసు, సొంగ కిషోర్, పోలపల్లి చినబాబు, గడ్డం ఆనంద్, భూషణం, కడిమి బాలకృష్ణ, ఈర్లగడ్డ హనుమంతు పాల్గొన్నారు.



గ్రామస్తులతో కలిసి అభివాదం చేస్తున్న నాయకులు

చేసిన సేవలతోనే నాయకులకు గుర్తింపు

ప్రజాశక్తి-కడియం

చేసిన సేవలు, అభివద్ధి నాయకులకు గుర్తింపు తెస్తాయని తద్వారా ప్రజల అభిమానం మన్ననలు పొందవచ్చని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఇటీవల మృతి చెందిన మండలంలోని కడియపులంక గ్రామ సర్పంచ్ మార్గాని అమ్మాణి సంస్మరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ గోరంట్ల మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా, గ్రామాభివద్ధే ధ్యేయంగా పని చేసిన సర్పంచ్ అమ్మాణి మతి తీరని లోటన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు , నర్సరీ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎంఎల్‌ఎ గోరంట్ల, నాయకులు

వాలంటీర్లకు ఘన సత్కారం

ప్రజాశక్తి-గోపాలపురం, తాళ్లపూడి


రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ, సంక్షేమం పథకాలు అమలు చేస్తున్న సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని రాజంపాలెం సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం రాజంపాలెంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమ కోసం సిఎం వైఎస.జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రతి ఒక్కరూ ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం వ్యవస్థ రూపొందించి గ్రామ స్థాయిలోనే గ్రామ అభివృద్ధి, సమస్యలను పరిష్కరించుకునేందుకు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. గ్రామంలోని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 130 మందికి 1/2 అర ఎకరం చొప్పున పట్టాలు త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురుకూరి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారదులుగా ఉంటూ సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తున్న వాలంటీర్ల సేవలు మరువలేనివని తాళ్లపూడి ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, వైసిపి మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు అన్నారు. వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో మండలంలోని పోచవరంలో బుధవారం వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడారు. రానున్న కాలంలో మండలంలోని వాలంటీర్లు సేవా వజ్ర, సేవారత్న అవార్డులు తీసుకునేలా ప్రజలకు సేవలందించాలని అన్నారు.



గోపాలపురంలో వాలంటీర్లకు సత్కారం

కార్టూ'నిజం'





మహిళలకు సాయం అందిస్తున్న మానవత సభ్యులు

ఇద్దరు మహిళలకు మానవత సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండలంలోని రావూరుపాడులో సమస్యలతో బాధ పడుతున్న ఇద్దరు మహిళలకు మానవత సంస్థ ఆధ్వర్యాన బుధవారం సాయం అందించారు. గ్రామంలో భర్త చనిపోయి ఒంటరిగా జీవిస్తున్న పుప్పాల కాంతమ్మ, భర్త అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్న గోకవరపు మల్లీశ్వరికి చెరో రూ.2500 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ కార్యక్రమంలో మానవత శాఖ అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు కార్యదర్శి సుబ్బారావు ఇసి సభ్యుడు సనపల రాజశేఖర్ రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, సభ్యులు నాగేశ్వరరావు, హరీష్ బాబు, గనిరాజు వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

రైతులంతా సాగుకు సన్నద్ధం అవ్వాలి

ప్రజాశక్తి-గోపాలపురం

సార్వా సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులందరూ సాగుకు సన్నద్ధం అవ్వాలని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు పిలుపునిచ్చారు. గోపాలపురం సొసైటీ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ సార్వా సీజన్‌కు సంబంధించి రైతులు పంటలు రకాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఎవరి వద్ద నుండి కొనుగోలు చేసినా తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. విత్తనాలు చల్లే ముందుగా తప్పనిసరిగా మొలక శాతం, విత్తన శుద్ధి చేయడం వంటి మెలకువలను పాటించాలని కోరారు. భూసార పరిరక్షణ కోసం నేలను సారవంతం చేయడానికి రసాయనిక ఎరువులను మాత్రమే కాక తప్పనిసరిగా పశువుల ఎరువు వర్మి కంపోస్ట్ జీవన ఎరువులను మరియు పచ్చిరొట్ట ఎరువులను పొలంలో వేసుకొని కలియ దుండినట్లయితే భూసారం సమతుల్యంగా ఉండి వేయబోయే పంటలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయన్నారు. జూన్ 1న రైతు భరోసా పిఎం కిసాన్ పథకం కింద అర్హులైన సొంత భూమి కలిగిన వారి ఖాతాల్లో రూ.7500 చొప్పున ప్రభుత్వం జమ చేయనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో ప్రచురించినట్లుగా తెలిపారు. జూన్ రెండో తేదీన వైయస్సార్ యంత్ర సేవ పథకం కింద వ్యవసాయ యంత్ర పరికరాలు తీసుకున్న వారికి మెగా మేళా నిర్వహించి అందజేయనున్నట్టు తెలిపారు.



రైతులకు కిట్లు అందజేస్తున్న సిబ్బంది

చంద్రన్న పథకాల బాణాలతో వైసిపి చిత్తు

ప్రజాశక్తి-కడియం

వేమగిరిలో జరిగిన మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు విసిరిన పథకాల బాణాలు వైసిపిని చిత్తు చేస్తాయని పలువురు టిడిపి నాయకులు అన్నారు. వేమగిరిలో ఎన్టీఆర్ విగ్రహానికి, చంద్రబాబు చిత్ర పటానికి బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలు అందరికీ మేలు కలుగచేస్తా యన్నారు. ఇవన్నీ రాబోయే ఎన్నికల్లో టిడిపికి తిరుగులేని అధికారం కట్టబెడతాయన్నారు. ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం నవరత్నాల పేరుతో పలు నగదు బదిలీ పథకాలు అందిస్తున్నా, వాటిలో సగానికిపైగా లబ్ధిదారుల కోతలతో నడుస్తున్నాయని, ఇలాంటి తరుణంలో ఎలాంటి సాకులు లేకుండా ఎంతమంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని చెప్పడం సంతోషకరమన్నారు.

నేరాలు ఘోరాలు

ఎసిబికి చిక్కిన మున్సిపల్‌ ఎఇ

ప్రజాశక్తి - పిఠాపురం

సివిల్‌ కాంట్రాక్టర్‌ వద్ద నుండి రూ.40 వేలు లంచం తీసుకుంటూ మున్సిపల్‌ కార్యాలయంలోని ఇంజినీరింగ్‌ సెక్షన్‌ ఎఇగా విధులు నిర్వహిస్తున్న వంశీ అభిషేక్‌ ఎసిబి వలకు రెడ్‌ హ్యాండెడ్‌గా చిక్కాడు. ఎసిబి అడిషనల్‌ ఎస్‌పి సౌజన్య తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరం ఎసిబి అధికారులను ఈ నెల 26వ తేదీన పట్టణానికి చెందిన సివిల్‌ కాంట్రాక్టర్‌ ఎస్‌.సత్తిరాజు సంప్రదించారని తాను పూర్తిచేసిన రెండు సివిల్‌ పనులకు సంబంధించిన ఎం బుక్స్‌ తయారు చేయడానికి దాన్ని ఆన్‌లైన్‌ నమోదు చేయించేందుకు ఎఇను సంప్రదించగా రూ.40వేలు లంచం డిమాండ్‌ చేసినట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు ట్రాప్‌ పోసిడింగ్స్‌తో కాంట్రాక్టర్‌ నుండి రూ.40వేలు బుధవారం తన కార్యాలయంలోనే వంశీ అభిషేక్‌ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నామని, అతని కుడి చేతిపై నిర్వహించిన రసాయన పరీక్ష సానుకూల ఫలితాన్ని ఇచ్చిందని ఆమె తెలిపారు. సదరు ఎఇ చర్చి సెంటర్లో నివాసం ఉంటున్న ఇంట్లో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. మున్సిపల్‌ కార్యాలయంలో ఎసిబి దాడులు నిర్వహించడంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ సెక్షన్‌ కార్యాలయం లోపలికి ఎవరూ రాకుండా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎఇ అభిషేక్‌ లంచంగా తీసుకున్న రూ.40వేలను స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలోని కంప్యూటర్‌లో సమాచారం పలు పత్రాలను పరిశీలించారు. ఎసిబి దాడులు రాత్రి వరకు కొనసాగాయి. ఈ దాడులలో ఎసిబి సిఐలు వి.పుల్లారావు, వై.సతీష్‌, డి.వాసు కృష్ణ, బి.శ్రీనివాస్‌, ఎస్‌ఐ విల్సన్‌ సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్‌పి ఖాదర్‌ బాషా

హిజ్రా హత్య కేసులో నిందితుల అరెస్ట్‌

ప్రజాశక్తి-అమలాపురం

హిజ్రా హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. బుధవారం అమలాపురం ఎస్‌పి కార్యాలయం లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అడిషనల్‌ సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోలీస్‌ ఖాదర్‌ బాషా వివరాలను వెల్లడించారు. గత నెల 13న రాత్రి ఆలమూరు మండలం జొన్నాడ గ్రామ శివారు 216 జాతీయ రహదారిని ఆనుకొని పంటకాలువలో ధవళేశ్వరానికి చెందిన మరపట్ల ఆనంద్‌ (ఎ.ఆనంది) అను హిజ్రాని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. చుట్టుప్రక్కల వారి ద్వారా విషయం తెలుసుకొన్న ఆనంది గురువు అయిన ధనాల మందాకిని ఆలమూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఆలమూరు ఎస్‌ఐ శివప్రసాద్‌ కేసు నమోదుచేశారన్నారు. కొత్తపేట డిఎస్‌పి రమణ పర్యవేక్షణలో రావులపాలెం సిఐ రజని కుమార్‌ దర్యాప్తు చేపట్టారన్నారు. దర్యాప్తులో భాగంగా ఆనంది తో పరిచయం ఉన్న కేతా భరత్‌ వెంకటసుధీర్‌, ఎ.పెద్దకెతాను, అతని స్నేహితులు అయిన వీలు కళ్యాణ్‌, ఎ.పెద్దకల్లి, సింగంపల్లి కార్తికేయ, ఎ.సింభ, ఎ.సోనూను విచారించామన్నారు. గత నెల 13న రాత్రి కేతా భరత్‌ వెంకట సుధీర్‌, స్నేహితులు సింగంపల్లి కార్తికేయ, సోనూ కలిసి ఆనంది(హిజ్రా)ని మోటార్‌ సైకిల్‌పై వేమగిరి సెంటర్‌లో ఎక్కించు కొన్నారన్నారు. తర్వాత మద్యం కొనుక్కొని జొన్నాడ శివారు పంటకాలువ వద్దకు తీసుకు వెళ్లారన్నారు. అనంతరం పెద్ద కేత మరొక స్నేహితుడు వీలు కళ్యాణ్‌ కు ఫోన్‌ చేసి అక్కడకు రప్పించుకొన్నారన్నారు. పెద్ద కల్లీ కూడా మద్యం తాగిన తర్వాత ఆనంది(హిజ్రా) పెద్ద కేతా గురించి తప్పుడు గా ప్రచారం చేస్తుందనే కోపంతో ముందుగా కేతా భరత్‌ బటన్‌ నైఫ్‌ తో ఆనందిని పొడి చాడన్నారు. సోనూ కాళ్ళు పట్టుకొగా, పెద్దకెతా వద్ద ఉన్న బటన్‌ నైఫ్‌ని కల్లీ లాక్కొని ఆనందిని కోసివేశా డన్నారు. సోనూ బీర్‌ బాటిల్‌ తో తల మీద కొట్టడంతో ఆనంది చనిపోయిందని ఎఎస్‌ పి తెలిపారు. ముగ్గురూ ఆనంది ని పక్కనే ఉన్న పంట బోదే లోకి నెట్టివేశారు. అప్పటికి ఆనంది (హిజ్రా) కొన ఊపిరి తో ఉండటంతో కల్లీ గమనించి ఆమె మెడను బటన్‌ కత్తితో కోసి వేశాడన్నారు. నిందితులు ముగ్గురూ ఇచ్చిన వాంగ్మూలం అరెస్టు చేసి వారి వద్ద నుంచిహత్య చేయడానికి ఉపయోగించిన బటన్‌ నైఫ్‌ని, రూ.800 నగదు, మోటార్‌ సైకిల్‌, ఒక సిడి డీలక్స్‌ మోటార్‌ సైకిల్‌ను స్వాధీనపరచుకున్నామన్నారు. ముగ్గురు నిందితుల్లో కేతాపై గతంలో హత్య కేసు ఉందన్నారు.

ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరంమండలంలోని సుందరపల్లి వద్ద ఇసుక లారీ ఢీకొని మంగళవారం రాత్రి ఒక వ్యక్తి మృతి చెందాడు. కోటిపల్లి నుంచి ఇసుకలోడుతో వెళుతున్న లారీ సుందరపల్లి మద్ద సుబ్బారావు అనే వ్యక్తిని ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని రామచంద్ర ఏరియా ఆసుపత్రిలో తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కె.గంగవరం ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

బిసిలకు రక్షణ చట్టం ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి-కొత్తపేట


బీసీలకు రక్షణ చట్టం తీసుకువస్తానని ఇటీవల రాజమహేంద్రవరంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ప్రకటనపై టిడిపి నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బుధవారం మండలం టిడిపి బిసి సెల్‌ ఆధ్వర్యంలో కొత్తపేటలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలోమండల టిడిపి బిసి సెల్‌ అధ్యక్షులు కముజు వెంకటేశ్వరరావు, జిల్లా టిడిపి కార్యదర్శి యల్లమిల్లి జగన్‌ మోహన్‌ రావు, మాజీ సర్పంచ్‌ చవల జగన్నాథం, పార్లమెంటు గౌడ సాధికారిక సమితి కన్వీనర్‌ మిద్దె ఆదినారాయణ, మాజీ సర్పంచ్‌ రెడ్డి తాతాజీ, గుబ్బల సత్తిపండు, మాజీ సర్పంచ్‌ జక్కంశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

270 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

ఒఎన్‌జిసి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక లైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 270 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఒఎన్‌జిసి, ఈస్టర్న్ ఆఫ్ షోర్ కాకినాడ, ఇనార్బిట్ ఆసుపత్రి, లయన్స్ క్లబ్ యానాం పిల్లరాయ సభ్యులు పాల్గొని సహాయ సహకారాలు అందించారు. లయన్స్ క్లబ్ యానాం పిల్లరాయ ప్రెసిడెంట్ పులవర్తి శ్రీను మాట్లాడుతూ 270 మందికి హెల్త్ చెకప్ నిర్వహించామని దానిలో 31 మందికి కంటి ఆపరేషన్ కొరకు రాజమహేంద్రవరం పరమహంస యోగా నంద నేత్రాలయ ఫౌండేషన్ పంపించామన్నారు. ఈనెల 2న దరియాలతిప్ప కెఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్, 4వ తేదీన కనకాలపేట కెపివిఎన్ ప్రభుత్వ హైస్కూలలో ఈ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ అశోక్ కోరారు. శిబిరంలో ఆర్ఎఒ మునిస్వామి, ఒఎన్‌జిసి డైరెక్టర్ మాలిక్, సిఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు, ఎంఎల్‌ఎ అశోక్‌

దొమ్మేటి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఎ దొమ్మేటి వెంకటేశ్వర్లు సేవలు చిరస్మరణీయమని తాళ్లరేవు ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, అత్తిలి బాబురావు తణుకు రాంబాబు, గోడి భాస్కర రావు వడ్డి ఏడుకొండలు, దుప్పి అదృష్ట దీపుడు అన్నారు. కాకినాడ దొమ్మేటి కుటుంబ సభ్యులను కలిసి స్వగృహంలో దొమ్మేటికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ దొమ్మేటి నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ కాక ముందు నుంచి అనేక సేవలు ప్రజలకు అందించారని, ఎంఎల్‌ఎ కాకముందే ప్రజలకు అనేక రూపాలలో సహకరించారన్నారు. నిరంతరం ప్రజలలో తిరుగుతూ ప్రజల అభిమానాన్ని పొందుతూ ప్రజల మనిషి అనిపించుకున్నారని అటువంటి మనిషి మన మధ్య లేక పోవడం చాలా విచార కరమన్నారు. ఆయన సేవలను ఆదర్శంగా తీసుకుని ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు ప్రజలకు సేవలు అందించాలని విజ్ఞప్తి చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ పేలి ధాన్యం రాశుల దగ్ధం

ప్రజాశక్తి - కాజులూరు

పంట పొలాల మధ్య ఉన్న ట్రాన్స్ఫార్మర్‌ పేలడంతో ధాన్యం రాసులు దగ్ధం అయినట్టు స్థానికులు, రెవెన్యూ సిబ్బంది తెలిపారు. బుధవారం మండలంలోని సెలపాక గ్రామంలో వల్లూరి రామకష్ణ చౌదరి పొలంలో వున్న విద్యుత్‌ ట్రాన్స్ఫార్మర్‌ ఒక్కసారిగా పేలిపోవడంతో పక్కనే ఉన్న సుమారు 200 బస్తాల ధాన్యం పాక్షికంగా దెబ్బతిన్నాయి. సమీపంలో ఉన్న రైతులు మంటలను అదుపులోకి తీసుకు రావడంతో రెండు లక్షల వరకు నష్టం వాటి ల్లినట్లు తెలిపారు .ధాన్యం రాశలను గ్రామ రెవెన్యూ అధికారి కనికమ్మ సచివాలయం సిబ్బంది పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.


పాక్షికంగా దగ్ధమైన ధాన్యం రాశులు

విత్తనాల దుకాణాలపై విజిలెన్స్‌ దాడులు

ప్రజాశక్తి-అమలాపురం

విత్తనాల దుకాణాలపై విజిలెన్స్‌ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. విజిలెన్స్‌ డైరెక్టర్‌ జనరల్‌ రవి శంఖర్‌ అయ్యన్నార్‌ ఆదేశాల మేరకు ఇంచార్జ్‌ ఎస్‌పి కె.కుమార్‌ ఆధ్వర్యంలో విజిలెన్స్‌ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి వ్యవసాయ శాఖ, లీగల్‌ మెట్రాలజి అధికారులతో కలిసి సంయుక్తముగా కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్‌ బిఆర్‌.అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలలో సంయుక్తముగా విత్తనముల దుకాణలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. డాక్టర్‌ బిఆర్‌.అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలోని అమలాపురం పట్టణంలో శ్రీ చైతన్య విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేసిన విజిలెన్స్‌ అధికారులు ప్రిన్సిపల్‌ సర్టిఫికెట్‌ లేకపోవడం, స్టాక్‌ రిజిస్టర్‌, బిల్‌ పుస్తకములు నిర్వహించడం లేదని గుర్తించి ఆ షాపు పై 6-ఏ క్రింద కేసు నమోదు చేశారు. సుమారు రూ.24,260 విలువ గల 3.74 క్వింటాళ్ల జనుము, పిల్లిపెసర విత్తనములను సీజ్‌ చేశారు. సుమారు రూ 53,497 విలువ గల సుమారు 6.94 క్వింటాళ్ల వరి, మినుము విత్తనముల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్‌ సత్యకిషోర్‌, తహశీల్దార్‌ విజయ్‌ కుమార్‌, కానిస్టేబుల్స్‌ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-మండపేట

ఇంటర్మీడియట్‌ అడ్వాన్స్‌ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. గత నెల 25న ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఇటీవల మండపేటలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల పరీక్ష కేంద్రంలో ముగ్గురు విద్యార్థులకు బదులు మరో ముగ్గురు పరీక్ష రాసేందుకు ప్రయత్నిస్తుండగా వారిని అధికారులు గుర్తించి పట్టణ పోలీస్‌ స్టేషన్లో అప్పగించగా వారిపై పోలీస్‌ లు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి ఉద్యోగ సంఘాల రిలే దీక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రభుత్వఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నమని జిల్లా విఆర్‌ఒల సంఘం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం మున్సిపల్‌ కార్యాలయం ఎదురుగా దీక్షా శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారాయుడు, ఆదిలక్ష్మి , జిల్లా ఆఫీస్‌ బేరర్స్‌ , వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గుంటారన్నారు.

ఆరు పథకాలతో అందరికీ మేలు

ప్రజాశక్తి-రాజోలు

ఇటీవల జరిగిన మహానాడులోయ టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలు అందరికీ మేలు చేస్తాయని ఆ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకట రమణ అన్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ మహా నా డులో చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టోలో అద్భుతమైన పథకాలున్నాయని అన్నారు. మహిళలు, యువత, రైతులు, బిసి వర్గాలు ఈ పథకాలకు పట్టం కడతారన్నాయరు.

పచ్చ బారిన పశువుల నీటి కుండి

- పట్టించుకోని మున్సిపల్‌ అధికారులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్‌ కార్యాలయం వెనుక ఆవరణలో 40 హెచ్‌పి మంచినీటి బోరు ఎదురుగా పశువుల దాహం తీర్చేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నీటి కుండీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయక పోవడంతో నాచు పేరుకుపోయి అధ్వాన్నంగా తయారయింది. పశువులు నీటిని తాగేటప్పుడు కుండీ నుండి బయటపడిన నీరు ప్రవహించే ఏర్పాటు చేయకపోవడంతో కుండి చుట్టూ బురద గుంటగా మారిపోయింది. దీంతో ఆ రహదారిలో వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మున్సిపల్‌ అధికారులు స్పందించి ఈ నీటికుండీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించ డంతో పాటు ఈ కుండీ చుట్టూ బురదగుంట ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.


నాచు పేరుకుపోయిన పశువుల నీటి కుండీ

సర్వీస్‌ను రెగ్యులరైజ్‌ చేయాలి

- మంత్రి బొత్సకు కాంట్రాక్టు లెక్చరర్ల వినతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్‌

తమ సర్వీసు రెగ్యులరైజ్‌ చేయాలని కోరుతూ కాంట్రాక్టు లెక్చరర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కో-కన్వీనర్‌ గొర్ల మాణిక్యం ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతి పత్రం సమర్పించారు. బుధవారం జెఎన్‌టియుకెలో జరిగిన స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రిని కలిసి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు లెక్చరర్స్‌ అందరినీ రెగ్యులరైజ్‌ చేయాలని కోరారు. ఇప్పటికే మాతో పాటుగా పనిచేసిన కాంట్రాక్టు లెక్చరర్స్‌ని తెలంగాణలో రెగ్యులరైజ్‌ చేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ అతి తొందరలోనే మీకు కూడా రెగ్యులరైజేషన్‌ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా, డాక్టర్‌. బిఆర్‌. అంబేద్కర్‌ జిల్లాల అధ్యక్షులు షేక్‌ రబ్బానీ గౌస్‌, పి.అలివేలు మంగతాయారు, పెర్వేల సూర్య నారాయణ మూర్తి, విజయకుమార్‌, మూర్తి సుధాకరవర్మ, శివన్నారాయణ పాల్గొన్నారు.


మంత్రి బొత్సను కలిసిన కాంట్రాక్ట్‌ లెక్చరర్‌ నాయకులు

ఊడి పడిన సీలింగ్‌

కార్పొరేషన్‌ ఉద్యోగులకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్‌

కాకినాడ నగరపాలక సంస్థ పరిధి టౌన్‌ ప్లానింగ్‌ సెక్షన్‌ కార్యాలయంలో బుధవారం టౌన్‌ ప్లానింగ్‌ విభాగం సూపరింటెండెంట్‌, ఇతర సిబ్బంది పనిచేసే హాలులో ఉన్న ట్టుండి సీలింగ్‌ ఊడిపడింది. దీంతో అధికారు లకు ఎటువంటి ప్రమాదం జరగకుండా తప్పించు కున్నారు. ఈ విషయమై అక్కడ పని చేస్తున్న సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు, డిఇ సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవనం నిర్మాణ పనుల్లో భాగంగా ఆయా విభాగాలను మారుస్తూ బాలభవన్‌ వద్ద ఉన్న మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో ఈ మధ్యకాలంలోనే నిర్మించిన సీలింగ్‌ ఊడిపడడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ఊడిపడిన స్లాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

4న పర్యావరణ పరిరక్షణపై జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4వ తేదీన కాకినాడ పి.ఆర్‌. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి పర్యావరణ పోటీలను నిర్వహి స్తున్నట్లు జాతీయ బాలల సైన్స్‌ కాంగ్రెస్‌ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, వి.బి.వి.ఆర్‌. చారిటబుల్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. చిత్రలేఖనం, కవితల పోటీ, వ్యాస రచన, క్విజ్‌, ఏక పాత్రాభినయం అనే ఐదు అంశాలలో నిర్వహిస్తున్నారు. పర్యావరణ- పరిరక్షణ అనే అంశంపై ఈ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో 4వ తరగతి నుండి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొన వచ్చన్నారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులకు చార్టులు, వైట్‌ పేపర్లు ఇవ్వబడతాయన్నారు. అన్ని పోటీలు ఉదయం 8 గంటల నుండి 10 గంటల మధ్య జరుగుతాయన్నారు. పాల్గొను విద్యార్థి ఏదో ఒక్క పోటీలో మాత్రమే పాల్గొ నాలన్నారు. పెయింటింగ్‌కు సంబంధించిన కలర్స్‌ ఎవరికి వారే తెచ్చు కోవాలన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్‌ సర్టిఫికెట్‌ అందజేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు కేసరి శ్రీనివాస రావు, 9912703697 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ పోటీలలో పాల్గొనగోరు ప్రతి విద్యార్థి క్రింది గూగుల్‌ లింక్‌లో ఈనెల రెండో తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు తప్పనిసరిగా రిజిస్టర్‌ చేసుకోవాలని తెలిపారు.

2న జిల్లా స్థాయి స్విమ్మింగ్‌ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్‌

సామర్లకోట దుర్గాప్రసాద్‌ ఇంగ్లీష్‌ మీడియం పాఠశాలలో ఈనెల రెండో తేదీన కాకినాడ జిల్లా ఆక్వాటిక్‌ (స్విమ్మింగ్‌) ఎంపికలు జరుగుతాయని సంఘ కార్యదర్శి ఐ.రాజు బుధవారం తెలిపారు. ఈ పోటీలు జిల్లా ఆక్వాటిక్‌ సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్‌ ఆధ్వర్యంలో జరుగుతాయని, 2003 వ సంవత్సరంలో పుట్టిన వారు అర్హులని రాజు చెప్పారు. ఈ పోటీల నుంచి మొత్తం 14 మంది యువకులు, 14 మంది యువతులను రాష్ట్రస్థాయి పోటీలకు, ఎంపిక చేయనున్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్‌ కార్డ్‌, వయసు ధ్రువీకరణ పత్రంతో రావాలన్నారు. ఈ పోటీలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10వ తేదీన విజయవాడలో జరిగే ఎనిమిదవ సీనియర్‌ ఆక్వాటిక్‌ అంతర్‌ జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన వారు జూలై 2వ తేదీ నుంచి 5 వరకు హైదరాబాదులో జరిగే సీనియర్‌ నేషనల్‌ స్విమ్మింగ్‌ పోటీల్లో పాల్గొంటా రన్నారు. మరిన్ని వివరాలకు సంఘ కార్యదర్శి 92466 90466 నెంబర్‌ సంప్రదించాలని సంఘ గౌరవ సలహాదారుడు మంగా వెంకట శివరామకృష్ణ తెలిపారు.

జెవికె కిట్లను సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - కాజులూరు

జెవికె కిట్లను విద్యార్థులకు సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్‌ సిఎంఒ చామంతి నాగేశ్వరరావు కోరారు. మండల కేంద్రమైన కాజులూరు జడ్‌పి ఉన్నత పాఠశాల, భవిత పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు ప్రముఖ వైద్యులు సివికే రావు అందించిన ప్రోటీన్‌ ఫుడ్‌ ను అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందిస్తుందని వీటిని విద్యార్థులకు సక్రమంగా అందించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.వి.వి.సత్యనారాయణ, సిఆర్‌పిలు సుజాత, ప్రశాంతి, నాగజ్యోతి శ్రీనివాస్‌, సత్యనారాయణ, చంటిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లమిల్లి కుటుంబానికి యనమల పరామర్శ

ప్రజాశక్తి- రౌతులపూడి

సొసైటీ మాజీ అధ్యక్షులు నల్లమిల్లి తాతాజీ కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి యనమల కృష్ణుడు బుధవారం తాతాజీ స్వగ్రామమైన బిబి పట్నం లోని తన నివాసానికి వెళ్లి తాతాజీ కుటుంబ సభ్యులు పరామర్శించారు కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపిపి లు భాస్కర్‌ బాబు, పైలా సాంబశివరావు, పలువురు టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.

1.10 కోట్ల వ్యయంతో తాగునీటి ట్యాంక్‌ నిర్మాణం

ప్రజాశక్తి,అన్నవరం(తొండంగి)

తొండంగి మండలం ఎవి నగరంలో అరబిందో సంస్థ సహకారంతో 1.10 కోట్ల వ్యయంతో 1.5 లక్షల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన తాగు నీటి ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌ నిర్మాణ పనులకు బుధవారం గ్రామ సర్పంచ్‌ కొయ్య జగదీశ్వరి మురళీ కృష్ణ, స్థలదాత యనమల సత్య నారాయణలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ కొయ్య జగదీశ్వరి మురళీకష్ణ మాట్లాడుతూ పంచాయతీకి, గ్రామ ప్రజల నీటి అవసరములు తీర్చే నిమిత్తం సుమారు రూ.కోటి 10 లక్షలతో "అరబిందో ఫార్మా ఫౌండేషన్‌" సిఎస్‌ఆర్‌ నిధులతో ఎవి నగరంలో మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ భాస్కర్‌ ప్లాంట్‌ హెడ్‌, ఇంజినీర్‌ గణపతి రాజు, ఫౌండేషన్‌ సిబ్బంది, టెక్‌ కన్సల్టెంట్‌ ఎస్‌ఆర్‌ నిర్మాణ్‌ సిబ్బంది, పంచాయతీ వార్డ్‌ మెంబర్లు, గ్రామ సచివాలయం ఆర్‌డబ్ల్యుఎస్‌ సిబ్బంది పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్‌ మురళీకృష్ణ

నేటి నుంచి 5 జిల్లాల జెడ్‌పిటిసిలకు శిక్షణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్‌

సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో పూర్వపు ఐదు జిల్లాలకు చెందిన జెడ్‌పిటిసిలకు ఈనెల 5వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించనున్నట్లు విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌ జె.వేణుగోపాల్‌ బుధవారం తెలిపారు. మూడు రోజులు చొప్పున ఏడు బ్యాచ్‌ల జడ్‌పిటిసిలకు పాలనాంశాలపై ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నట్లు చెప్పారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జడ్‌పిటిసిలు పూర్వపు ఐదు జిల్లాల నుంచి ఈ శిక్షణకు హాజరు కానున్నట్లు ఆయన వివరించారు.

పథకం ప్రకారమే ధాన్యం వ్యాపారి హత్య

ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం

ప్రజాశక్తి -మండపేట

పథకం ప్రకారమే ధాన్యం వ్యాపారి గొలుగూరి కోదండ వెంకట రామారెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు ధ్రువీకరించారు. బుధవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను రామచంద్రపురం డిఎస్‌పి టియస్‌ఆర్‌కె.ప్రసాద్‌ వెల్లడించారు. పట్టణానికి చెందిన రామారెడ్డి ఈనెల 25వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ అతని భార్య శ్వేత మండపేట పట్టణ పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు రోజుల తర్వాత రామారెడ్డి మోటార్‌ సైకిల్‌ బైపాస్‌ రోడ్డులో ఉండడంతో పోలీసులు వివిధ కోణాల్లో కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. రామారెడ్డి పట్టణానికి చెందిన పాల వ్యాపారి రావూరి సూర్యారావుకు వ్యాపార నిమిత్తం రూ. 80వేలు అప్పుగా ఇచ్చాడు. అప్పు తిరిగి చెల్లించమని పదేపదే అడుగుతుండడంతో అది అవమానంగా భావించిన అతడు తమ్ముడు ఏసురాజుతో కలిసి రామారెడ్డిని హత్య చేసేందుకు కుట్ర పన్నారని డిఎస్‌పి తెలిపారు. ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో అప్పు చెల్లిస్తామని రామారెడ్డికి ఫోన్‌ చేసి స్థానిక 2వ వార్డులో శ్రీ లక్ష్మి నగర్‌లోని పశువులపాక వద్దకు రమ్మని ఫోన్‌ చేశాడన్నారు. రామారెడ్డి అక్కడికి రాగానే ముందుగా తవ్వి ఉంచిన 8 అడుగుల లోతు గల గోతిలోకి తన సోదరునితో కలిసి నెట్టారన్నారు. రామారెడ్డిని బలమైన రాయితో తలపై మోది హత్య చేశారన్నారు. రామారెడ్డి భార్య ఫిర్యాదులో పేర్కొన్న కాల్‌ రికార్డ్‌ వివరాలలో సూర్యారావు డబ్బులు ఇస్తానని పిలిచినట్లు తెలుపడంతో ఆకోణంలో దర్యాప్తు జరిపిన పోలీసులు సూర్యారావును అదుపులోకి తీసుకోగా ఏసురాజు పరారీలో ఉన్నాడన్నారు. రామారెడ్డి మెడలోని బంగారం గొలుసు ఏసురాజు తీసుకుని రూ.లక్షకు తాకట్టు పెట్టి సెల్‌ఫోన్‌ తదితర వస్తువులు కొనుగోలు చేశాడన్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. ఫోరంసిక్‌ డాక్టర్‌ పి.ఉమామహేశ్వరరావు, తహశీల్దార్‌ టిఆర్‌.రాజేశ్వరరావు సమక్షంలో శవపంచనామ చేశారు. సిఐ శివగణేష్‌, ఎస్‌ఐలు అశోక్‌, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మృతదేహం పాతి పెట్టిన ప్రదేశం వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేత

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

ఇటీవల వెలువడిన టెన్త్‌ పరీక్ష ఫలితాల్లో 576 అధిక మార్కులు సాధించిన కపిలేశ్వరపురానికి చెందిన విద్యార్థిని బొక్కే వర్షిత కు పూర్వ విద్యార్థులు ప్రోత్సాహక నగదు బహుమతి బుధవారం అందజేశారు. స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాల్లో1990-91 వ బ్యాచ్‌ పూర విద్యార్థులు బొక్కే సత్యనారాయణ, రమణి కుమారి దంపతుల కుమార్తె వర్షిత కు రూ. 20 వేలు నగదు వారి ఇంటి వద్ద అందజేశారు.. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాకా శ్రీనివాస్‌, తెరుకోటి త్రినాథ్‌, వెంకట మాస్టర్‌, పాలెపు మూర్తి పాల్గొన్నారు.


వర్షితకు రూ.20వేలు అందజేస్తున్న దృశ్యం

ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిపించేలా చర్యలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిపించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎం.దుర్గారావు వైద్యాధికారులకు సూచించారు. ఆయన బుధవారం వెల్ల పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సదపాయాలు, వివిధ పథకాలు సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆన్లైన్‌,ఆఫ్‌ లైన్‌ ప్రక్రియలను పలు రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు పట్ల సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్‌ పి.మమత, డాక్టర్‌ ఎస్‌వి. ఆదినారాయణ, సూపర్‌వైజర్లు వి.ఈశ్వరమ్మ, కె.శ్రీనివాస్‌, జి.కమల్‌శేషు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు